విజేతలతో ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా సత్యనారాయణ, క్రీడల నిర్వాహకులు

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

● ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా సత్యనారాయణ

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 28 : క్రీడాకారులు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా సత్యనారాయణ అన్నారు. సూర్యాపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర స్ప్రింట్స్, మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ మీట్ సూర్యాపేట-2024ను ప్రారంభించి అనంతరం గెలుపొందిన విజేతలకు షీల్డులు, మెడల్స్‌ను ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి నుంచి స్ఫూర్తి పొంది ముందుకు సాగాలన్నారు. అనంతరం అండర్ 14, 16, 18, 20 విభాగాలో బాల బాలికలు, స్త్రీ పురుషుల పరుగు పందెంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన సుమారు 650 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఆజాం బాబా, హనుమంతరావు, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, యాదయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

మతోన్మాద బీజేపీని ఓడించాలి

● న్యూడెమోక్రసీ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్‌రావు

నేరేడుచర్ల, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాసిస్ట్ శక్తులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని కామ్రేడ్ రవన్ననగర్‌లో ఆదివారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెట్టి ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ఘనులు బీజేపీ పాలకులు అని దుయ్యబట్టారు. కావున ప్రజలందరూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, నాయకులు వెంకన్న, లక్ష్మయ్య పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, రేణుక పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సీపీఎం, ప్రజా సంఘాల మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వరుసగా పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, సీపీఎం మండల కార్యదర్శి వట్టిపు సైదులు, నాయకులు గుండు సైదులు, బాణావత్ బాలాజీనాయక్, ఆదినారాయణ, అశోక్, ప్రకాశ్, కె.నరసింహారావు, ఎల్ఎస్ రావు, భిక్షపతిరావు, సైదులు, ఆనంద్ పాల్గొన్నారు.

వెంకటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తెలంగాణ సాయుధ పోరాటంలో వెంకటయ్యది కీలక పాత్ర

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 28 : భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో బొమ్మగాని వెంకటయ్య పాత్ర కీలకమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ జాతీయ నాయకుడు బొమ్మగాని వెంకటయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక జీవీవీ ఫంక్షన్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. వెట్టి చాకిరి విముక్తితో పాటు గీత వృత్తి పరిరక్షణకు, భద్రతకు ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. బొమ్మగాని వెంకటయ్య ఆదర్శాల కోసం కృషి చేస్తూ ఆయన ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమళ్ల హసేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు కేవీఎల్, బొమ్మగాని శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ రామ్మూర్తియాదవ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దేవాలయంలో పూజలో పాల్గొన్న మున్సిపల్ ఈఈ దుర్గాప్రసాద్

సూర్య దేవాలయంలో మహా సౌరహోమం

అర్వపల్లి, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని తిమ్మాపురం సూర్య దేవాలయంలో ఆదివారం మహా సౌరహోమం నిర్వహించారు. ఉష పద్మిని ఛాయ సమేత సూర్యనారాయణ స్వామికి అర్చన, అభిషేకాలు చేశారు. సూర్యాపేట మున్సిపల్ ఈఈ దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు హమాలీలు మద్దతుగా నిలువాలి

● బీఆర్‌టీయూ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ

చివ్వెంల, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను గమనించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి హమాలీలు మద్దతుగా నిలువాలని బీఆర్‌టీయూ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లి శివారులో గల నవోదయ రైస్ మిల్లులో హమాలీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ఉత్సవాల్లో హమాలీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైస్ ఇండస్ట్రీని షెడ్యూల్ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక హమాలీలకు పని కల్పించాలని, బీహార్‌కు చెందిన హమాలీలు శ్రమ దోపిడి గురౌతున్నారని, హమాలీల రేట్లు బీహార్ హమాలీలకు అతి తక్కువ చెల్లిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హమాలీల సాధారణ మరణానికి రూ.5 లక్షలు అందివ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం హమాలీలు ఐక్యంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హమాలీ మేస్త్రీలు యాదగిరి, నాగు, లింగయ్య, దుర్గయ్య, రవి, సైదులు, కార్మికులు పాల్గొన్నారు.

చివ్వెంల : హమాలీలతో మాట్లాడుతున్న వెంపటి గురూజీ

మే డే వేడుకలను జయప్రదం చేయాలి

గరిడేపల్లి : మే డే వేడుకల్లో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు కామళ్ల నవీన్ అన్నారు. మండలంలోని వెలిదండ గ్రామంలో సంఘానికి సంబంధించిన గ్రామ హమాలీ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మే 1 నుంచి 7 వరకు పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా నిర్వహించే మే డే వారోత్సవాల్లో అంతా పాల్గొనాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రధాని మోదీ సవరణల పేరుతో కాలరాసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. దీనిని కార్మికులంతా దృష్టిలో ఉంచుకుని లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు, నాయకులు గండు నాగేశ్వర్‌రావు, రమేశ్, అంజయ్య, సువార్త, సంతోష్, సైదులు, రేణుక, నాగయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా మే 1న గ్రామ గ్రామాన ఎర్ర జెండాలు ఎగురవేసి ఉత్సవాలను ఘనంగా జరుపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య కోరారు. మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను నేడు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందని ఆరోపించారు. కనీస వేతన చట్టాన్ని సవరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం కార్మికులను శ్రమ దోపిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాములు, పాపయ్య, సైదులు, వెంకటయ్య, వీరమల్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : మే డే వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ అన్నారు. పట్టణంలోని కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ నాయకులు శ్రీను, వెంకన్న, రామయ్య, బాలకృష్ణ, వీరబాబు, కోటేశ్వర్‌రావు, నరసింహారావు, లింగయ్య, వీరబాబు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

గరిడేపల్లి, ఏప్రిల్ 28 : కారు, రెండు ద్విచక్రవాహనాలను ఢీకొనగా ఓ మహిళ మృతి చెందడంతో పాటు మరో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని పొనుగోడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. గరిడేపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన చింతకాయల భద్రయ్య అదే గ్రామానికి చెందిన తన సోదరి గడ్డం వెంకటమ్మతో కలిసి బైక్‌పై నేరేడుచర్ల మండలం బోడలదిన్నె గ్రామంలో తమ బంధువుల ఇంట జరుగుతున్న వివాహానికి బయల్దేరారు. ఈ క్రమంలో పొనుగోడు గ్రామ సమీపంలో గల పెట్రోల్ బంక్‌లో బైక్‌లో పెట్రోల్ కొట్టించుకుని బయటకు వెళ్తున్న క్రమంలో నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఆర్.నాగేందర్ అనే వ్యక్తి కారులో సూర్యాపేట వైపుకు వెళ్తూ నేరుగా బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. అంతే వేగంతో ముందుకు వెళ్లి అదే మార్గంలో వెళ్తున్న కుతుబ్‌షాపురం గ్రామానికే చెందిన కారింగుల శేఖర్, రేణుక దంపతుల బైక్‌ను సైతం ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో భద్రయ్య, వెంకటమ్మకు తీవ్రగాయాలు కాగా, శేఖర్, రేణుక స్వల్పంగా గాయపడినట్లు వెల్లడించారు. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.వెంకటమ్మ, భద్రయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటమ్మ (48) మృతి చెందినట్లు తెలిపారు. భద్రయ్యకు ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలు వెంకటమ్మ భర్త గడ్డం అచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గరిడేపల్లి ఎస్ఐ సైదులు తెలిపారు.

వెంకటమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 28 : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చైతన్య భారతి పాఠశాల 1993-94 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మండ్లపల్లి ప్రభాకర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువుకు చెప్పిన పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ రావు, ఉపాధ్యాయులు జివి, నాగార్జున్, శేఖర్, జానికిరాములు, ఆనంది, అమీనా, ఉపేందర్, బి.శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు.

బొడ్రాయిబజార్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చైతన్యభారతి పాఠశాల 1993-94 విద్యార్థులు

నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్ఎస్‌లో..

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నెలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05వ విద్యా సంవత్సర పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు మైక్ సెట్ బహూకరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రేమజంట ఆత్మహత్య

● సామాజిక వేరు కావడంతో పెండ్లికి అంగీకరించని పెద్దలు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 28 : క్షణికావేశంలో ఓ ప్రేమ జంట తీసుకున్న తొందరపాటు నిర్ణయం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో యువతీ, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గుండగాని సంజయ్ (25) చదువు పూర్తి చేసుకొని సూర్యాపేటలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సల్లగుండ నాగజ్యోతి (21) ఫార్మసీ పూర్తి చేసుకొని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో పార్మాసిస్ట్‌గా పనిచేసింది. ఇటీవల ఇంటికి వచ్చి సూర్యాపేటలోని ఓ దవాఖానలో ఫార్మాసిస్ట్‌గా చేరింది. కాగా, వీరిద్దరూ ఐదేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. వారి కులాలు వేరు కావడంతో పెండ్లికి ఇరువురి కుటుంబ పెద్దలు అంగీకరించడం లేదు. గతంలో నాగజ్యోతి తరపు బంధువులు తమ అమ్మాయి జోలికి రావద్దని సంజయ్‌ని మందలించగా నెల రోజుల క్రితం ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో తమ పెండ్లికి పెద్దలు అంగీకరించరని వారిలో వారే మదనపడిపోయారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెల్లవారుజామున అటుగా వెళ్లిన రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

సంజయ్

నాగజ్యోతి

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

● ఫిర్యాదు బుట్టదాఖలు చేసి తమపైనే కేసు నమోదు చేశారని ఆరోపణ

మునగాల, ఏప్రిల్ 28 : తాము ఇచ్చిన ఫిర్యాదు బుట్టదాఖలు చేసి తమపైనే పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తంచేస్తూ సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన దామెర వెంకటమ్మ, కృష్ణయ్య దంపతులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని సీఐ రామకృష్ణారెడ్డి ఎదుట హాజరుపరిచారు. కేసు వివరాలు.. వెంకటమ్మ తమ పొలంలో బావి తీయించేందుకు కొన్ని నెలల క్రితం రూ.50 వేల నగదు తమ ఇంట్లో పెట్టగా చోరీకి గురయ్యాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరిగి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అంజిరెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన పట్టించుకోలేదన్నారు. దాంతో ఎస్పీకి ఫిర్యాదు చేయగా కోదాడ డీఎస్పీకి ఎండార్స్ చేసినట్లు వెల్లడించారు. ఈ విషయమై ఎస్ఐ అంజిరెడ్డిని కలువగా రూ.20 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. డబ్బులు లేవని తెలుపగా తమపైనే కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు వివరించారు. శనివారం తమ ఇంటికి ఓ కానిస్టేబుల్ వచ్చి పోలీస్ స్టేషన్‌కి రావాలని తెలిపాడు. దాంతో ఆందోళన చెందిన తాము ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. స్పందించిన సీఐ రామకృష్ణారెడ్డి బాధితులకు న్యాయం చేస్తామని, ఎస్ఐపై విచారణ చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

లక్ష్మాపురంలో ఓటరు స్లిప్పులు పంపిణీ

నాగారం, ఏప్రిల్ 28 : మండలంలోని లక్ష్మాపురంలో బీఎల్ఓ మల్లెపాక కవిత ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం వంటిదన్నారు. కార్యక్రమంలో వెంకన్న, అంజయ్య, ముత్తయ్య, భిక్షం, శోభ పాల్గొన్నారు.

లక్ష్మాపురంలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్ఓ కవిత

ఎన్నికల వ్యయాన్ని స్థానిక అధికారులకు అందించాలి

● ఎన్నికల వ్యయ పరిశీలకుడు కల్యాణ్ కుమార్‌దాస్

కోదాడ రూరల్, ఏప్రిల్ 28 : పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును ఎప్పటికప్పుడు స్థానిక అధికారులకు అందించాలని నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కల్యాణ్ కుమార్‌దాస్ అన్నారు. కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామ శివారు పాలేరు వాగు సమీపంలోని రాష్ట్ర సరిహద్దు వాహన తనిఖీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం, నగదును చట్ట వ్యతిరేక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థుల ప్రచార వ్యయాలు ఎన్నికల నియమాలను అనుసరించి ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ సీహెచ్ సూర్యానారయణ ఉన్నారు.

రామాపురం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు కల్యాణ్ కుమార్‌దాస్

ఆలయాల నిర్మాణానికి విరాళం

కోదాడ రూరల్, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని ఎర్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న మాదిగ కులస్తుల ఆరాధ్య దైవం సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బాషబోయిన భాస్కర్‌రావు ఆదివారం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. అలాగే గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు రూ.2 లక్షలు విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణాలకు పూజలు చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అర్చకుడు ఇనుపకుత్తికల లక్ష్మీనరసింహశాస్త్రి, మాదిగ కుల పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న దాత భాస్కర్‌రావు

బండ ఆగుడు పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

కొనసాగుతున్న ఎద్దుల బండ లాగుడు పోటీలు

మఠంపల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని శుభవార్త దేవాలయ తిరుణాల సందర్భంగా శుభోదయ యూత్ ఆధ్వర్యంలో మాన్‌ఫోర్ట్ హైస్కూల్ నందు ఎద్దుల బండ లాగుడు పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం క్యాటగిరీ విభాగానికి చెందిన 9 జతలు పాల్గొన్నాయి. అనంతరం ఆరు పండ్ల విభాగంలో గెలుపొందిన పశు పోషకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఎస్సీ సుంకి సురేందర్‌రెడ్డి, శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు ఆదూరి కిశోర్‌రెడ్డి, గాలి చిన్నపరెడ్డి, మర్రెడ్డి ఆదూరి మధుసూధన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, బాలశౌరెడ్డి, గాదె విక్టర్‌రెడ్డి, కందుల కిరణ్‌రెడ్డి, గాదె నవీన్‌రెడ్డి, జడ్డు జయబాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డులతో విద్యార్థులు

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 28 : మండల పరిధి రామలక్ష్మీపురం గ్రామంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం గ్రామానికి చెందిన అన్నెం నరసింహారెడ్డి, స్రవంతి దంపతులు, పాపిరెడ్డి అధ్వర్యంలో ప్రతిభా పురస్కరాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్ ఉన్నత శిఖరాలను అధిరోహించి గురువులకు, గ్రామానికి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, బుడిగ వీరబాబు, ఎన్ఆర్ఐలు బాలనాగిరెడ్డి, నరసింహారెడ్డి, వీరనాగిరెడ్డి పాల్గొన్నారు..

కల్మల్‌చెర్వులో చలివేంద్రం ప్రారంభం

గరిడేపల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుడు రువ్వ నర్సయ్య సహకారంతో ఆదివారం చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బచ్చలకూరి నాగయ్య, కోశాధికారి కుక్కునూరి గోవర్ధన్, సభ్యులు నర్సయ్య, జనార్దన్, బాలెన వెంకటకృష్ణ, మీసాల వెంకటేశ్వర్లు, కోలపూడి భాస్కర్ పాల్గొన్నారు.